





ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడుతున్న అంతర్జాతీయ క్రీడాకారిణి సిక్కిరెడ్డి

నగరంలో సిక్కిరెడ్డి సందడి

ఖమ్మం ఇండోర్ స్టేడియంలో సరదాగా షటిల్ ఆట

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత సిక్కిరెడ్డి శనివారం నగరంలో సందడి చేశారు. ఖమ్మంలో పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె సర్దార్ పటేల్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియాన్ని సందర్శించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులతో కొద్దిసేపు షటిల్ ఆడి తన అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే అత్యంత శక్తివంతమైన గుర్తింపు లభిస్తుందని, క్రీడలతో ప్రపంచానికి పరిచయ మవుతామన్నారు. బ్యాడ్మింటన్‌లో రాణించాలంటే చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో నేర్చుకోవాలని సూచించారు. ఖమ్మం గడ్డమీద తాను పెరిగిన రోజులు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. తనకు ఇక్కడ బ్యాడ్మింటన్ క్రీడను పరిచయం చేసిన వారిని, శిక్షణ ఇచ్చిన ప్రతి గురువునూ మరిచి పోలేనన్నారు. ఎంత బిజీగా ఉన్నా.. అప్పుడపుడూ వారితో మాట్లాడతానన్నారు. వారి వల్లనే తనకు ఇంతటి గుర్తింపు లభించిందన్నారు. బ్యాడ్మింటన్ బాగా ఆడే క్రీడాకారులకు హైదరాబాద్‌లోని తన శిక్షణ కేంద్రంలో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తానని తెలిపారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం బాధ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం బాధ్యులు సిరిపురపు సుదర్శన్, వి.చంద్రశేఖర్, జట్ల శ్రీను, దుద్దుకూరి సత్యనారాయణ, లక్ష్మణ్, తుపాకుల యలగొండస్వామి, రిటైర్డ్ పోలీస్ అధికారులు బాలకిషన్, నరసయ్య తదితరులు ఉన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



ఖమ్మం కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను నిర్వహించేందుకు నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (ఐడీఓసీ), పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను ముస్తాబు చేశారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీజ , పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జాతీయ జెండాను ఉదయం 9 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి కొత్త కలెక్టరేట్‌లో, పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఖమ్మం అర్బన్ తహసీల్దారు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని కలెక్టర్ స్వీకరించనున్నారు. పోలీస్ అధికారులు కూడా పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. పరేడ్‌లో స్టాళ్ల ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల పంపిణీ కార్యక్రమంతో పాటు అభివృద్ధి ఉట్టిపడేలా స్టాళ్లు, శకటాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు కొత్త పథకాలపై ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. దీనికోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం రాత్రి కలెక్టరేట్ కార్యాలయాన్ని ముస్తాబు చేశారు. ఐడీవోసీలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అన్ని శాఖల అధికారులు ఇక్కడ పాల్గొన్న తర్వాత పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లనున్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పండుగలా పంపిణీ కార్యక్రమం

నూతన పథకాల ప్రారంభాన్ని ఒక పండుగలా చేపట్టాలని ప్రభుత్వం సూచించడంతో అందుకు తగ్గట్టుగా సన్నాహాలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో ముందుగా సీఎం రేవంత్‌రెడ్డి సందేశం ప్రదర్శించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. తొలిరోజు పంపిణీకి ఎంపిక చేసిన గ్రామంలో ముందుగా పథకాల ప్రారంభానికి గ్రామ ప్రజలందరినీ పిలవడం, నాలుగు నూతన సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాల్లో అర్హులు మాత్రమే ఉండేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మార్గదర్శకాలను వివరించడం, లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించి ప్రజాప్రతినిధులు సందేశాలు ఇచ్చేలా కార్యక్రమం రూపొందించారు. నాలుగు పథకాల అమలు సందర్భంగా గ్రామాల్లో ఎక్కడా ఇబ్బందులు రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకుంటున్నారు.

'సంక్షేమ' సంబురం

నేడు రిపబ్లిక్ డే సందర్భంగా నాలుగు పథకాల అమలుకు శ్రీకారం

- తొలిరోజు మండలానికి ఒక గ్రామంలో లబ్ధిదారులకు అర్హత పత్రాల అందజేత
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

ఖమ్మం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గణతంత్ర దినోత్సవం వేళ రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతోంది. ఎన్నికల హామీల అమలులో భాగంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భోరోసా, రేషన్‌కార్డుల పంపిణీకి చేపట్టిన సర్వే, గ్రామసభల ప్రక్రియ పూర్తి కావడంతో ఆదివారం ఈ పథకాల అమలును ప్రారంభించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం 1గంటకు నాలుగు పథకాలను లాంఛనంగా ప్రారంభించాలని ఆదేశించారు.

తొలిరోజు ప్రతి మండలంలో ఎంపిక చేసిన ఒక గ్రామంలో మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందించాలని సూచించారు. దాంతో ఇందుకు సంబంధించిన జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఎంపికైన గ్రామంలో అతి నిరుపేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతులకు రైతుభరోసా అందించనున్నారు. రేషన్‌కార్డుల జారీని తహసీల్దార్ల బృందం, ఇందిరమ్మ ఇళ్ల జాబితాను ఎంపీడీవోల బృందం, రైతుభరోసాను మండల వ్యవసాయాధికారుల బృందం, ఇందిరమ్మ ఆత్మీయభరోసా జాబితాను ఏపీవో నరేగా బృందం సిద్ధం చేసి ఆదివారం ఉదయం మండల ప్రత్యేక అధికారికి జాబితా అందించనున్నారు.

జిల్లాలో నాలుగు రోజులపాటు నిర్వహించిన గ్రామసభల్లో మండలాలనుంచి ఇందిరమ్మ ఇళ్లకు 51,712, రేషన్‌కార్డులకు 50,914, రైతుభరోసా 5,532, ఇందిరమ్మ ఆత్మీయభరోసాకు 36,994 దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఇచ్చిన దరఖాస్తులతో పాటు ఈ దరఖాస్తులను కూడా అధికారులు పరిగణలోకి తీసుకోనున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో మొత్తం 24,479 దరఖాస్తులు రాగా ఇందిరమ్మ ఇళ్లు 7,191, రేషన్‌కార్డులకు 7,401 దరఖాస్తులు వచ్చాయి. వీటితో పాటు గతంలో ప్రజాపాలనలో రేషన్‌కార్డులకు 30,665, ఇందిరమ్మ ఇళ్లకు 3,57,869, దరఖాస్తులు వచ్చాయి. గ్రామసభలకు ముందుగా అధికారులు సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తించారు. గ్రామసభల్లో జాబితాల చదివి వినిపించారు.

మొత్తంమీద రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కీలక పథకాల అమలుకు శ్రీకారం చుట్టనుండడంతో లబ్ధిదారుల్లో ఉత్సాహం నెలకొంది. దశలవారీగా అర్హులందరికీ ఈ పథకాలు అందనున్నాయి. ఇందిరమ్మ ఇంటి కోసం పేదలకు రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు రైతుభరోసా ఎకరానికి ఏడాదికి రూ.12వేలు, ఉపాధి కూలీలకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఆత్మీయభరోసా రూ.12వేలు అందించనున్నారు. గ్రామాల్లో ఏడాదికి రూ.లక్షన్నర, పట్టణాల్లో రూ.2లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి రేషన్‌కార్డులు లభించనున్నాయి.

శభాష్ రాహుల్

- గవర్నరు నుంచి ఐటీడీఏ పీవోకు అవార్డు
- గత పార్లమెంటు ఎన్నికలు విజయవంతంగా నిర్వహణ



భద్రాచలం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ప్రత్యేక అవార్డును అందుకున్నారు. హైదారాబాద్‌లో శనివారం జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఈ అవార్డును అందజేశారు. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల సమయంలో బెల్లంపల్లి పార్లమెంటు నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా రాహుల్ విజయవంతంగా ఎన్నికల విధులు నిర్వహించినందుకు అవార్డును అందజేశారు. ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పీవోకు అభినందనలు తెలిపారు.

ఇరిగేషన్ సీఈగా రమేష్‌బాబు



ఖమ్మం కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్‌గా ఓవీ రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సూర్యాపేటలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రమేష్‌బాబును ఖమ్మానికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన కె.విద్యాసాగర్ గత నెలలో పదవీ విరమణ పొందిన నేపథ్యంలో ఈ పోస్టు ఖాళీగా ఉంది. జిల్లాలో మున్నేరు రక్షణ గోడల నిర్మాణంతోపాటు సీతారామ ప్రాజెక్టు పనులు జరుగుతున్న నేపథ్యంలో సీఈ పోస్టు ఖాళీగా ఉండడంతో సూర్యాపేట సీఈకి అదనపు బాధ్యతలను అప్పగించింది. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలిసింది.

బోనకల్‌కు సౌర వెలుగులు

- పీఎంఎస్‌జీ పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక
- డిప్యూటీ సీఎం భట్టి విజన్‌తో మెరుగైన విద్యుత్ సేవలు
- 22 గ్రామాల గృహ వినియోగదారులకు సౌర విద్యుత్



బోనకల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఏడాది ప్రభుత్వ పాలనలో మధిర నియోజకవర్గానికి వేల కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి రాష్ట్రంలోనే తన మార్కును చూపించారు. తాజాగా ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరాతో పాటు ఉచితంగా అందించేందుకు మరో పథకాన్ని నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో వందశాతం అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో పీఎంఎస్‌జీ (ప్రధానమంత్రి సూర్య ఘర్) సౌర విద్యుత్ పథకానికి సంబంధించి మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేశారు. కాని బోనకల్ మండలంలోని 22 గ్రామాలను పూర్తిగా పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి గృహ వినియోగ దారులకు సౌర విద్యుత్‌ను అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మండలంలో మొత్తం 18 వేల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. గత రెండు రోజులుగా పలు మండలాల నుంచి కేటాయించిన 30మంది విద్యుత్ సిబ్బంది బోనకల్ మండలంలోని గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి విద్యుత్ సర్వీసు వివరాలు, ఆధార్, ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 3 వేల విద్యుత్ సర్వీసుల సర్వే పూర్తి కాగా మిగిలిన వాటిని ఈ నెల 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో విద్యుత్ అధికారులు గ్రామాల్లో సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతి ఇంటి పైన సోలార్ పలకలను ఏర్పాటు చేసి 3 కిలో వాట్ల విద్యుత్‌ను రోజువారీ వినియోగించుకునే అవకాశం ఉంది. సోలార్ విద్యుత్‌కు సంబంధించి ప్రత్యేకమైన మీటర్‌ను ఏర్పాటు చేసి వినియోగాన్ని బట్టి మిగిలిన విద్యుత్‌ను తిరిగి ఎన్‌పీడీసీఎల్‌కు వినియోగదారులు విక్రయించుకోవచ్చు. జిల్లాలోనే పైలట్ ప్రాజెక్టుగా బోనకల్ మండలాన్ని మొత్తం సౌర విద్యుత్ కింద ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలందించే విధంగా పనులు జరుగుతుండటంతో ప్రజలు డిప్యూటీ సీఎం భట్టిని అభినందనలతో ముంచెత్తుతున్నారు.

పోరాట యోధుడు 'కాసాని' కన్నుమూత



- 40 ఏళ్లుగా ప్రజా ఉద్యమాలతో మమేకం
- వరంగల్‌లో పుట్టి కొత్తగూడెంలో నాయకుడిగా ఎదిగి...
- సీపీఎం నేతగా తనదైన ముద్ర
- ప్రజా ఉద్యమాల్లో 23సార్లు జైలుపాలు
- నివాళులర్పించిన నాయకులు, సంఘాల ప్రతినిధులు
- సుజాతనగర్‌లో నేడు అంత్యక్రియలు



ఆస్పత్రిలో అయిలయ్య మృతదేహం

కొత్తగూడెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని అయిలయ్య (75) శనివారం భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గుండె పోటుతో మృతిచెందారు. ప్రజా ఉద్యమాలు, భూ పోరాటాలు, రైతు కూలీల హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించిన ఆయన సీపీఎంతో 40ఏళ్ల అనుబంధాన్ని కలిగి ఉన్నారు. ఆయన మృతితో భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

అయిలయ్య వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో జన్మించి జీవనోపాధి కోసం సుజాతనగర్ మండలం రెడ్డిపాలెం గ్రామానికి వచ్చారు. కూలీలకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. సీపీఎం కార్యకర్తగా జీవితం ప్రారంభించిన అయిలయ్య ప్రజా ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించి 1981లో సుజాతనగర్ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కొత్తగూడెం పట్టణంలో ఇళ్ల స్థలాల సాధన కోసం ఉద్యమాలు నిర్వహించిన అయిలయ్య సీపీఎం డివిజన్ కార్యదర్శిగా పనిచేశారు. రైతు కూలీలు, ఇళ్ల స్థలాల సాధనలో జరిగిన ఉద్యమాల్లో జైలు జీవితం గడిపారు. అయిలయ్యకు కుమార్తె జ్యోతి, కుమారుడు లెనిన్ ఉన్నారు. ఆయన భార్య లక్ష్మి 2017లో మృతిచెందారు.

అయిలయ్య మృతి పట్ల కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. ఆయన భౌతికకాయానికి జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, జిల్లా సహకార సంఘం మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కొత్తగూడెం సహకార బ్యాంకు చైర్మన్ మండె వీరహనుమంతరావు, సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా, కాంగ్రెస్ నాయకులు జినుగు బాలశౌరి, నాగసీతారాములు, కోనేరు సత్యనారాయణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆదివారం సుజాతనగర్‌లో సంతాప కార్యక్రమం అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు సీపీఎం వర్గాలు తెలిపాయి.

తుదిశ్వాస వరకు పోరుబాట...

అయిలయ్య తన తుదిశ్వాస వరకు ప్రజా పోరాటాల్లోనే నిమగ్నమయ్యారు. 40 ఏళ్లుగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని 23 సార్లు జైలు జీవితం గడిపారు.

సుజాతనగర్ మండలం రెడ్డిపాలెంలో ఆర్‌ఎంపీగా పని చేస్తూనే సీపీఎం ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. ప్రధానంగా వ్యవసాయ కూలీ రేట్ల పెంపకంతోపాటు ఇళ్ల స్థలాల సాధన, విద్యుత్ ధరల పెంపుదలపై రాజీలేని పోరాటాలు నిర్వహించారు. 1981 నుంచి 2001వరకు 20 ఏళ్లు సుజాతనగర్ సర్పంచ్‌గా పనిచేశారు. ఏన్కూరు మండలంలో ఉద్యమం నిర్వహించి 800మంది పేదలకు ఇళ్ల స్థలాలను సాధించారు.

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లిలో ప్రజా ఉద్యమాలకు ఆకర్షితుడై దివంగత ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ నేతృత్వంలో ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. సీపీఎం కొత్తగూడెం డివిజన్ కార్యదర్శిగా, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడిగా, సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా పని చేశారు. ఇటీవల ఏర్పాటు చేసిన కొత్తగూడెం కార్పొరేషన్‌కు వ్యతిరేకంగా సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామాలను కార్పొరేషన్‌లో కలప వద్దని ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

కాలయాపన లేని తీర్పులు అవసరం

- పరస్పర సహకారంతోనే కేసుల పరిష్కారం
- హైకోర్టు జడ్జి, ఖమ్మం పరిపాలన న్యాయాధికారి శ్రీసుధ
- ఖమ్మంలో రెండో అదనపు సీనియర్ సివిల్ కోర్టు ప్రారంభం
- పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు భీమపాక నగేష్, కాజా శరత్



సివిల్ కోర్టును ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

ఖమ్మం లీగల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పరస్పర సహకారం, మధ్యవర్తిత్వంతో కేసులకు పరిష్కారం లభిస్తుందని, కాలయాపనలేని తీర్పులు అవసరమని హైకోర్టు జడ్జి, ఖమ్మం పరిపాలనా న్యాయాధికారి శ్రీసుధ తెలిపారు. ఖమ్మం నగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో ఏర్పాటుచేసిన రెండో అదనపు సీనియర్ సివిల్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు నగేష్ భీమపాక, కాజా శరత్‌లతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీసుధ మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి అందరూ కృషి చేయాలన్నారు. పేదలకు, కక్షిదారులకు న్యాయ సహాయం అందించేందుకు న్యాయ వ్యవస్థలోని ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పరిష్కార పద్ధతుల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించు కోవచ్చన్నారు. మానవ సంబంధాలను పెంపొందించుకొని గ్రామస్థాయిలో శాంతియుత వాతావరణం నెలకొల్పటానికి మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించుకోవటంతో డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. మరో న్యాయమూర్తి జస్టిస్ శరత్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న కేసులను బట్టి కొత్త కోర్టులు అవసరమన్నారు. నూతన కోర్టులు ఏర్పాటైనా న్యాయమూర్తుల నియామకానికి సమయం పడుతుందన్నారు. జస్టిస్ భీమపాక నగేష్ మాట్లాడుతూ మనిషి అహం తగ్గించుకుంటే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సాధ్యమైనంత వరకు తెలుగులో మాట్లాడటానికి ప్రయత్నించాలన్నారు. తెలుగు భాష గౌరవాన్ని అందరూ కాపాడాలని సూచించారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయశాఖ ఉద్యోగ సంఘ నాయకులు, న్యాయవాదులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్, న్యాయాధికారులు కె.ఉమాదేవి, వెంపటి అపర్ణ, అర్చనకుమారి, దేవినేని రాంప్రసాదరావు, వి.సీనయ్య, ఎం.కల్పన, వి.శివరంజని, కె.దీప, వి.మాధవిలత, బి.నాగలక్ష్మి, బి.రజిని, ఏపూరి బిందుప్రియ, ఆర్.శాంతిలత, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాసరావు, సీహెచ్ వెంకట్, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు తుమ్మల, భట్టి పర్యటన

రఘునాథపాలెం/ఖమ్మం కలెక్టరేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం రఘునాథపాలెం మండలంలో పర్యటించనున్నారు. చింతగుర్తి రెవెన్యూ గ్రామ పరిధిలోని మల్లేపల్లిలో నిర్వహించే సభలో పాల్గొంటారు. 31 కుటుంబాలకు నూతన రేషన్‌కార్డులు అందివ్వనున్నారు. 20రైతు కుటుంబాలకు ఆత్మీయ భరోసా, 2,532 మంది రైతులకు రైతుభరోసా, 36 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నారు. తహసీల్దారు లూదర్ విల్సన్, ఎంపీడీవో అశోక్ ఏర్పాట్లు చేశారు.

భట్టి పర్యటన వివరాలు..

డిప్యూటీ సీఎం ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8:15కి ప్రజాభవన్‌లో బయల్దేరి సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్ గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారు. ఆ తర్వాత 1:30కి ఖమ్మం చేరుకుని అధికారులతో సమీక్షిస్తారు. ఆ తర్వాత 2:15కి కొణిజర్ల మండలానికి చేరుకుని 4 గంటల వరకు ప్రజాపాలన స్కీంలను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేస్తారు. 4 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి వెళ్తారు.



8

హైకోర్టు న్యాయమూర్తిగా తిరుమలాదేవి

తుమ్మలపల్లిలో హర్షాతిరేకాలు

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోటీపరీక్షలైన గ్రూప్1,2,3,4 పరీక్షలకు కేంద్ర ప్రభుత్వ స్టాఫ్‌సెలక్షన్ కమిషన్‌పోటీ పరీక్షలకు , రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్షలకుమైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కె.సత్యనారాయణ తెలిపారు. డిగ్రీపూర్తిచేసిన మైనారిటీ అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఈఉచిత శిక్షణ నాలుగునెలలుపాటు అందిస్తున్నట్టు తెలిపారు. ఈదరఖాస్తులను ఫిబ్రవరి 10తేదీలోపు నగరంలోని నూతన కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. పూర్తి వివరాలకు 9704003002 నెంబరలో సంప్రదించాలన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


నేలకొండపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

నేలకొండపల్లి, జనవరి25(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని పాపులేషన్ రీసెర్స్ సెంటర్, చెన్నై, బృందం, నేలకొండపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేసింది. సీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఏయే సేవలను అందిస్తున్నారు. అన్ని సౌకర్యాలున్నాయా? అంటూ ప్రశ్నించారు. వైద్యశాల ఆవరణ మొత్తం కలియతిరిగారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని చెప్పారు. రోగులకు ఉత్తమ సేవలు అందించాలని వివరించారు. రిసెర్స్ అధికారులు మురుగన్, చందన్ కుమార్, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి దుర్గ, జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ రఘురాం, వైద్యాధికారి డాక్టర్ మంగళ, వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నాగమణి, డాక్టర్ అర్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

బురదరాఘవాపురం విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి25(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశస్థాయి సైన్సుఫెయిర్‌లో ఏన్కూరు మండలం బురదరాఘవాపురం జిల్లాపరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం నుంచి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బహుమతులు పొందారు. విద్యార్థులు కె.మహిమ, ఎస్‌కే షాహిర్‌పాషా, గైడ్‌టీచర్లు సాగి సుజాత, పొట్ట రామారావు ఆధ్వర్యంలో విద్యార్థులు మేథమేటికల్ మోడలింగ్‌లో విజువలైజింగ్‌మ్యాథ్స్ మోడల్స్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై ప్రదర్శించిన ఎగ్జిబిట్‌కు బహుమతి పొందారని జిల్లా సైన్సు అధికారి జగదీశ్వర్ తెలిపారు. అవార్డు పొందిన విద్యార్థులను డీఈవో సోమశేఖర్శర్మ సైన్సు అధికారులు అభినందించారు.



ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- మండలానికి ఒక గ్రామంలో 'నాలుగు పథకాల' కార్యక్రమం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియోకాన్ఫరెన్స్


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన జిల్లా అధికారులు

ఖమ్మంకలెక్టరేట్,జనవరి25(ఆంధ్రజ్యోతి): నాలుగు కొత్తపథకాల ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. శనివారం ఆమె నూతన పథకాల ప్రారంభ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ పాల్గొన్నారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం నుంచి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డుల పథకాలను లాంచనంగా ప్రతీ మండలంలో ఒక గ్రామంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంటకు నాలుగు పథకాలను అధికారికంగా ప్రారంభించాలన్నారు. మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగాలని, 4పథకాలకు సంబంధించి ఆయా గ్రామాల్లో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. నాలుగు నూతన పథకాల ప్రారంభోత్సవం లో అర్హులు మాత్రమే జాబితాలో ఉండేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్షేమ పథకాల ప్రారంభోత్సవం పండుగ వాతావరణంలో జరగాలన్నారు. లబ్ధిదారులు కార్యక్రమానికి వచ్చేలా చూడాలన్నారు. ముందస్తుగా ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రతి గ్రామంలో ప్రదర్శించాలని సీఎస్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పథకాల అమలును ప్రారంభించాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం అడవుల్లో పెద్దపులి జాడ

కరకగూడెం,జనవరి25(ఆంధ్రజ్యోతి):మండలంలోని రఘునాథపాలెం అడవులలోకి మరోసారి పెద్దపులి వచ్చింది. ఇటీవల కరకగూడెం మండలంలోని రఘునాథపాలెం,గొళ్ళగూడెం,మునలమ్మగుట్ట, ములుగు జిల్లా ఏటూరునాగారం, మంగపేట, మల్లూరు, తాడ్వాయి, నర్సపూర్, బీరెల్లీ అటవి ప్రాంతంలో పెద్దపులి సంచరించి. అనంతరం మహబూబాబాద్ అటవీ ప్రాంతం వైపు వెళ్లింది. ఈనేపథ్యంలో శనివారం మరోమారు కరకగూడెం మండలంలోని రఘునాథపాలెం అటవీ ప్రాంతంలోకి వచ్చినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. అధికారులు పెద్దపులి జాడను గుర్తించినట్లు తెలిపారు. శనివారం మణుగూరు డివిజన్ అటవీశాఖ ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మొహిద్దీన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఇక్కడ దట్టమైన అటవీ ప్రాంతం ఉండటం, వన్యప్రాణులు, తాగునీరు మంచి ఆవాసం ఉండటంతో ఇక్కడ ఆవాసం ఏర్పర్చుకుందన్నారు. పెద్దపులి మూడునెలలుగా ఈ ప్రాంతాల్లో గ్రామాలకు దూరంగా ఆవాసం ఉంటుందన్నారు. ప్రజలకు కాని పశువులకు కాని ఎటువంటి హానీ చేయలేదని తెలిపారు. ప్రజలు అటవీ పాంతాలకు వెళ్లవద్దని, వన్యప్రాణులకు హాని చేయవద్దని హెచ్చరించారు.

రామయ్యను దర్శించుకున్న ఫిషరీస్ డైరెక్టర్


రామాలయంలో రాష్ట్ర ఫిషరీస్ డైరెక్టర్ ప్రియాంక అలా

భద్రాచలం,జనవరి25(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారిని రాష్ట్ర ఫిషరీస్ డైరెక్టర్, సివిల్ సప్లయ్ జాయింట్ కార్యదర్శి ప్రియాంక అలా దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రవీందర్ పాల్గొన్నారు.

మాదిగలకు 12శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి25(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని, జిల్లాల వారీగా వర్గీకరణ చేపట్టాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి అన్నారు. శనివారం నగరంలోనిప్రెస్‌క్లబ్‌లో మాదిగ జేఏసీ ఎస్సీ ఉపకులాల సంఘం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఎక్కడా వర్గీకరణ ఎందుకు అమలు జరగడంలేదని ప్రశ్నించారు. హైదరాబాదు డప్పుల మోతకు వచ్చేది ఎంఆర్‌పీఎస్ ముసుగులో బీజేపీ, ఆర్ఎస్ఎస్, బీఆర్ఎస్ వారేనని అన్నారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో 20శాతం మిగిలిన జిల్లాల్లో మాలలకంటే మాదిగలే అధికంగా ఉన్నారన్నారు. జిల్లాల వారీగా వర్గీకరణ చేసి ప్రభుత్వ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, డబుల్‌బెడ్‌రూంలలో మాదిగలకు అవకాశం కలిపించాలని కోరారు. ఈసమావేశంలో గురుమూర్తి, కె.శ్రీనివాస్, కె.రామారావు, ఎం.సైదులు తదితరులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 2న హైదరాబాదులో జరిగే విద్యార్థి యువగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు.

అండర్-17 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి 30 వరకు హైదరాబాద్‌లోని దోమల్‌గూడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా అండర్- 17 బాలుర క్రికెట్ జట్టును శనివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 48మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను తెలంగాణా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ మతిన్ ప్రకటించారు. జట్టులో గౌతమ్, ప్రియాన్ష్, ఇర్ఫాన్‌ఖాన్, అద్నాన్‌అహ్మద్, రామ్‌చరణ్, యువన్‌సిద్ధార్థ్, హిమేష్, చందు, జహీర్, ముజాహిద్, సాయిసాకేత్, నిరంజన్, లక్ష్మీవెంకటసుమార్, చరణ్, గోపీచంద్, మౌనిష్, శ్రీకాంత్, జయంత్, రాహుల్, గోవర్ధన్‌లు ఎంపికైనారు. ఎంపికలను ఆర్గనైజర్స్ ఇమ్రాన్ మారుతి శ్రీనివాస్, పవన్, రాము తదితరుల సమీక్షించారు. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ క్రీడాకారాలను పరిచియం చేసుకున్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన సీపీ



ఖమ్మంక్రైం, జనవరి25(ఆంధ్రజ్యోతి):శనివారం జిల్లాకు వచ్చిన హైకోర్టున్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ బీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్‌ను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తులకు మొక్కలను అందించారు. శనివారం సాయంత్రం నగరంలోని ఎన్ఎస్‌పీ గెస్ట్ హౌస్‌కు న్యాయమూర్తులు చేరుకోవడంతో వారు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కామేపల్లి,జనవరి25(ఆంధ్రజ్యోతి):రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన కామేపల్లి మండలం పొన్నెకల్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం దుబ్బతండకు చెందిన ఇస్లావత్ భాషా(35) భార్యతో కలిసిన ఈ నెల 24న ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఈక్రమంలో పొన్నెకల్ సమీపంలో లారీఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి అన్నకొడుకు అనిల్ ఫిర్యాదు ఎస్‌ఐ బి.సాయికుమార్ కేసు నమోదు చేశారు.

సుర్దేపల్లిలో నడిగూడెం పోలీసుల విచారణ

నేలకొండపల్లి, జనవరి25(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని సుర్దేపల్లి గ్రామంలో సూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీసులు శనివారం సాయంత్రం విచారణకు వచ్చారు. సుర్దేపల్లికి చెందిన కొరివి బ్రహ్మంపై 2022లోసూర్యాపేట జిల్లా నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో బాలికపై లైంగిక వేధింపులో పోక్సో కేసు నమోదైంది. 2022 నుంచి బ్రహ్మం కనపడటం లేదు. దీంతో సూర్యాపేట జిల్లా న్యాయస్థానం ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం నడిగూడెం ఎస్‌ఐ అజయ్ కుమార్ విచారణ చేసారు. ఇంటికి, స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయానికి నోటీసులు అంటించారు.

ఆలయంలో చోరీ

ఖమ్మంక్రైం,జనవరి25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు చోరీ చేశారు. సంఘటన శనివారం తెల్లవారుజామున ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని మామిళ్లగూడెం ప్రాంతంలో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో దొంగలు శనివారం తెల్లవారుజామున సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఆలయంలో హుండీలు పగలగొట్టి నగదును తీసుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయ కమిటీ, పూజారి చూసి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వివరాలు సేకరించారు. కాగా సుమారు లక్ష రూపాయల వరకు నగదు చోరీ అయి ఉండవచ్చని ఆలయకమిటీ అంటున్నారు.

కేఎంసీలో రెవెన్యూ మేళాకు స్పందన


వినతులు స్వీకరిస్తున్న ఆర్వో శ్రీనివాసరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో ఇంటి పన్ను నుంచి తాగునీటి కుళాయిల సమస్యల వరకు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన రెవెన్యూ మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. ఉదయం 10గంటల నుంచే ఫిర్యాదుదారులు క్యూ కట్టారు. అధికారులు సాయంత్రం వరకు వినతులు స్వీకరించారు. రెవెన్యూ మేళాలో ఆర్వో శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వినతులు స్వీకరించగా, కమిషనర్ అభిషేక్ ఆగస్త్య పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదులను వారం రోజులు లోగా పరిష్కారం చూపి వారికి సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. కాగా మొత్తం 88 రెవెన్యూ వినతులు అధికారులకు అందాయి. వాటిలో న్యూ ఎసెస్‌మెంట్స్ 9, ఇంటి యజమాని పేరు మార్పు 10, మ్యూటేషన్ 11, రివిజన్ పిటీషన్ 11, డబుల్ ఎంట్రీ 9, ఇంటి నెంబర్లు తప్పులు సవరణకు 8, చిరునామా మార్పు 3, డిమాండ్ నోటీసులు 2, ఎగ్జమెషన్ 10, నీటి కుళాయిలు తొలగింపునకు 5, మ్యూటేషన్ 4, పంపు కనెక్షన్‌కు7 వినతులు అందాయి. ఆయా దరఖాస్తులను రెవెన్యూ డివిజన్లు వారీగా విభజన చేసి ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు.

ప్రజలను ఉసిగొల్పుతున్న బీఆర్ఎస్

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల, రాయల, పోట్ల


మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నిరుపేదలకు కనీసం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, ప్రజాతీర్పును గౌరవించి ప్రతిపక్షంలో ఉండలేక అధికారదాహంతో ప్రజలను ఉసిగోల్పుతున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు విమర్శించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు చేసిన ప్రభుత్వ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పదేళ్లలో ప్రజలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వలేక పోవడంతో పదేళ్లకాలంలో ఏర్పడిన కుటుంబాలు ఇప్పుడు ఇందిరమ్మ ప్రభుత్వంలో అందిస్తున్నామని, భేషరుతుగా గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గులాబీ కార్యకర్తలకు ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, హుస్సేన్, నరాల నరేశ్, కొత్తా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిగా తిరుమలాదేవి

- స్వగ్రామం తుమ్మలపల్లిలో హర్షాతిరేకాలు

పెనుబల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా పెనుబల్లి మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన జస్టిస్ ఈడా తిరుమలాదేవిచేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజన్‌పాల్ శనివారం ప్రమాణస్వీకారం చేయించారు. సంగారెడ్డికి చెందిన జస్టిస్ తిరుమలాదేవికి ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత ఈడా చెన్నయ్య నాల్గో కుమారుడు హైకోర్టు న్యాయవాది ఈడా శేషగిరిరావుతో 1988లో వివాహం జరిగింది. తిరుమలాదేవి 1964 జూన్ రెండోతేదీన సంగారెడ్డిలో జన్మించారు. హైదరాబాద్‌లో లా డిగ్రీ పూర్తిచేసిన తర్వాత హైదరాబాద్ సిటీ, తెలంగాణ హైకోర్టుల్లో న్యాయవాదిగా పనిచేశారు. 2012లో ఆమె న్యాయమూర్తిగా నియమితులయ్యారు. తొలిసారి నిజామాబాద్ జిల్లాలో ఎస్సీ ఎస్టీ కోర్టులో ప్రత్యేక న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం ఖమ్మంజిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వరంగల్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తిగా పలు కీలక కేసుల్లో విచారణ చేపట్టారు. అనంతరం తెలంగాణ జ్యూడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రర్, హైకోర్టు రిజిస్ట్రర్ జనరల్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ఆమె ప్రమాణస్వీకారం పట్ల తుమ్మలపల్లి గ్రామంతోపాటు పెనుబల్లి మండలంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రకాశం స్టేడియం గ్రౌండ్ ముస్తాబు

- హాజరుకానున్న సింగరేణి ఛైర్మన్ బలరాం

కొత్తగూడెం టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రకాశంగ్రౌండ్‌ను సింగరేణి అధికారులు ముస్తాబు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులచే నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను సిద్ధం చేశారు. ప్రకాశంగ్రౌండ్‌లో జాతీయ జెండాను సింగరేణి ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించనున్నారు. సింగరేణి యాజమాన్యం ప్రకాశం గ్రౌండ్‌లో పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేసింది. సింగరేణి ఉద్యోగులు, కార్మికులు నిర్వహించే విధులను ప్రదర్శింపచేయనున్నారు. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా చేసేందుకు అధికారులుపెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

సింగరేణి ఉత్తమ కార్మికులు వీరే..

కొత్తగూడెం ఏరియా పీవీకే 5 ఇంక్లైన్‌లో ఎస్‌ఈగా పని చేస్తున్న కిషోర్‌బాబు, ఇల్లెందు ఏరియాలో జేకే ఓపెన్‌కాస్టులో ఎస్‌ఈగా పని చేస్తున్న చెన్నయ్య, మణుగూరు ఏరియాలో డీవైజీఎంగా పని చేస్తున్న నలగల రమేష్, రామగుండం ఏరియాలో డీవైజీఎంగా పని చేస్తున్న చిలక శ్రీనివాస్, రామగుండం-2లో డిప్యూటి మేనేజర్‌గా పని చేస్తున్న శంకరయ్య, రామగుండం -3లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న పి. నాగేశ్వరరావు, ఎఎల్‌పీలో డిప్యూటి ఎస్‌ఈగా పని చేస్తున్న శ్రీనాథ, భూపాలపల్లి మెడికల్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న గోపీ కృష్ణ, బెల్లంపల్లిలో డీజీఎంగా పని చేస్తున్న వీరన్న, మందమర్రిలో పని చేస్తున్న డిప్యూటి ఇంజనీరు శంకర్, శ్రీరాంపూర్ ఏరియాలో ఈఅండ్‌ఎంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పని చేస్తున్న అరుణ్, కొత్తగూడెం కార్పోరేట్‌లో ఈఅండ్‌ఎం సోలార్ విభాగంలో జీఎంగా పని చేస్తున్న జానకీరాం, కొత్తగూడెం కార్పోరేట్ సివిల్ డీజీఎం రాజశేఖర్‌లను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు సింగరేణి యాజమాన్యం శనివారం ప్రకటించింది. ఆదివారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సింగరేణి ఛైర్మన్ ఎన్. బలరాంచేతుల మీదుగా అవార్డులను అందచేయనున్నారు.

ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు స్థానిక ప్రగతిమైదానం ముస్తాబైంది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపల్, రెవిన్యూ అధికారుల పర్యవేక్షణలో పనులను పూర్తి చేశారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్‌లు హాజరుకానున్నారు.


విద్యుత్‌కాంతులతో భద్రాద్రి జిల్లా కలెక్టరేట్

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మణుగూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మణుగూరులోని రాదికా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి రాహుల్ నాయక్ అండర్-17 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల యాజమాన్యం రాహుల్‌ను అభినందించారు. పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించడం తమకెంతో ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ మధుతెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్షా కేంద్రాల సీజ్

బోనకల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బోనకల్ మండల కేంద్రంలో అనుమతులు లేని మూడు రక్త పరీక్షా కేంద్రాలను శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆదేశాల మేరకు సీఐ తిరుపతిరావు, ఎస్ఐ మధుబాబుతో కలిసి ల్యాబ్‌లను తనిఖీ చేశా రు. నిబంధనలు పాటించడం లేదని గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రామారావు, హెడ్ కానిస్టేబుళ్లు ఖాసీం సాహెబ్, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో చోరీ

వైరా, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వైరాలోని తల్లాడ రోడ్డులో ఉన్న ఎస్వీ ట్రేడర్స్(పురుగులు, ఎరువుల దుకాణం)లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వైరాకే చెందిన కొణతాలపల్లి నగేష్ తల్లాడ రోడ్డులో ఎస్వీ ట్రేడర్స్‌ను నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి దుకాణం బంద్ చేసి వెళ్లి న నగేష్ శనివారం ఉదయం వచ్చి షాపును తెరవగా పైభాగంలో రేకులకు రంధ్రం పెట్టి ఉండటాన్ని గమనించాడు. ఆతర్వాత సీసీ కెమెరాలు కూడా పగిలిపోయి కన్పించాయి. ఆవెంటనే టేబుల్ డెస్క్ ఓపెన్ చేసి ఉండగా అందులో ఉంచిన రూ.3.20లక్షల నగదు అపహరించుకుపోయి న విషయం బయటపడింది. వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ సిబ్బందితో సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఖమ్మం నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

పైలెట్ ప్రాజెక్టుగా ఖానాపురం


తాళాలు వేయడంతో కార్యాలయంలోనే ఉండిపోయిన అధికారులు

ముదిగొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న పథకాలకు పైలెట్ ప్రాజెక్టుగా ముదిగొండ మండలం ఖానాపురం గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. ఆదివారం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందించేందుకు ఖానాపురం గ్రామాన్ని ఎంపిక చేసుకొని సర్వే నిర్వహించారు. గ్రామంలో 630మంది జనాభా ఉండగా 536మంది ఓటర్లు ఉన్నారు.

కాగా ఆదివారం నుంచి ప్రారంభించనున్న నాలుగు పథకాలకు పైలెట్ ప్రాజెక్టుగా ఖానాపురం గ్రామాన్ని ఎంపిక చేయగా గ్రామంలో శనివారం రాత్రి సర్వే నిర్వహించారు. అప్పటి వరకు సర్వే సజావుగా సాగుతుండగా ఇంతలోనే వేరే గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని గ్రామస్థులకు అధికారులు చెప్పడంతో, తమ గ్రామంలో సర్వే నిర్వహించి, వేరే గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారంటూ అధికారులను గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉంచి బయట గేట్లకు తాళం వేసి ఆందోళన చేశారు. అధికారులు ముందుగా చెప్పినట్లుగా తమ గ్రామాన్నే పైలెట్ ప్రాజెక్టుగా ఉంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఖానాపురం గ్రామాన్నే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తున్నట్లు మండల అధికారులు తెలిపారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

మన్‌కీ బాత్ కార్యక్రమానికి కొత్తగూడెం వాసి ఎంపిక


రాజశేఖర్

చుంచుపల్లి, జనవరి25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షకుడు, ప్రకృతి హరిత దీక్ష అండ్ గ్రీన్ మోటార్ వెహికిల్ గార్డెన్ సంస్థ వ్యవస్థాపకుడు, సింగరేణి కార్మికుడు కొత్తగూడెం నివాసి కొట్టూరు సుర్వీ రాజశేఖర్ అలియాస్ మొక్కల రాజశేఖర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రతీ రోజు ఒక మొక్క నాటుతూ హరిత దీక్ష సేవలను కొనసాగిస్తున్న రాజశేఖర్ ప్రయత్నాలను పరిగణలోనికి తీసుకొని భారత ప్రభుత్వం మన్‌కీబాత్ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరు కావాలని రాజశేఖర్‌కు ఆహ్వానం పంపింది. కుటుంబ సమేతంగా ఢిల్లీకి పయనమయ్యారు. రాజశేఖర్‌ను సింగరేణి సంస్థ అధికారులు, కార్మికులు, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



సీఎమ్ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నేలకొండపల్లి,జనవరి25(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఇస్తున్న చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి కోరారు. శనివారం నేలకొండపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో 30మంది లబ్ధిదారులకు రూ.12.50లక్షల చెక్కులను దయాకర్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు,ఆరెకట్ల గుర్నాథం నాయకులు వేగినాటి లక్ష్మీనర్సయ్య, అనంతు కాశయ్య, షేక్.ఖాజామియా, కట్టికోల నాగార్జున, బచ్చలకూరి నాగరాజు,యడవల్లి సైదులు, కంజుల మోహన్‌రెడ్డి, రాయపూడినవీన్, తీగ రమణయ్య, నంబూరి రామారావు, మైసా శంకర్, మక్కాల రామకృష్ణ, పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	48
పచ్చిమిర్చి	36
కాకరకాయ	48
బెండకాయ	40
పొట్లకాయ	38
దోసకాయ	34-44
చిక్కుడు	48
నాటుచిక్కుడు	100
గోరుచిక్కుడు	38
క్యాబేజీ	24
దొండ	40-48
సొరకాయ	18
క్యారెట్	26
క్యాప్సికం	44
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	155
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	గేంచేంజర్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పుష్ప 2
కేపీఎస్:	హాంకాంగ్ వారియర్స్
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225979
కార్గోసేవల నెంబరు:	9154298589

ఖమ్మం పాతబస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225965
కార్గోసేవల నెంబరు:	9704345599

సత్తుపల్లి బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225990
కార్గోసేవల నెంబరు:	9154298595

మధిర బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ:	7382925289
కార్గోసేవల నెంబరు:	8143765370

ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్,జనవరి25(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఏవైనా ఓటు హక్కుని ప్రతీ ఓటరూ వినియోగించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. శనివారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా భారత ఎన్నికల కమీషన్ సీఈఓ సందేశాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా అందరితో ఓటు హక్కు వినియోగిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఓటుప్రాముఖ్యతను మరింత బలోపేతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, మనమంతా ప్రతిసారి ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని కోరారు. ఈసమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి,జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: ఓటు హక్కును తప్పనిసరిగా, నిర్భయంగా వినియోగించుకోవాలని తహసీల్దార్ జాదవ్ మాణిక్యం పిలుపునిచ్చారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉద్యోగులు, విద్యార్థులతో భారీర్యాలీ నిర్వహించారు. పీఎస్సార్ సెంటర్లో మానవహారం నిర్మించారు. ఓటు నాహక్కు, ఓటును అమ్ముకోను, ఓటును సద్వినియోగం చేసుకుంటాం...అంటూ ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ పరంజ్యోతి, ఎమ్మార్వైలు ఆలస్యం మధుసూధనరావు, రవి, ఎంపీఓ శివ, ఏపీఓ సునీత పాల్గొన్నారు.



ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలి

ఖమ్మంరూరల్: ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని మండల పరిధిలోని కోదాడ క్రాస్ రోడ్డులోని తెలంగాణా గురుకుల రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐలు ప్రసాద్, క్రాంతి పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవం ర్యాలీ

తిరుమలాయపాలెం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం తిరుమలాయపాలెంలో హైస్కూల్ విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక హైస్కూల్‌నుంచి ప్రారంభమై బస్టాండ్ సెంటర్‌వరకు సాగింది. అక్కడ మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకుమించిన ఆయుధంలేదని ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమలో ఎస్ఐ కూసుపుడి జగదీష్, ఏవో సీతారాంరెడ్డి ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఎంపీవో సూర్యనారాయణ, ఎస్‌వో రమాకుమారి, ఎంఈవో శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

స్తంభాద్రి డెస్క్ జర్నలిస్టుల ఫోరం ఆవిర్భావం

ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి25(ఆంధ్రజ్యోతి):డెస్క్‌జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా స్తంభాద్రి డెస్క్ జర్నలిస్టుల ఫోరం ఆవిర్భవించింది. ఖమ్మం మమత రోడ్డులోని విన్‌ఫీల్డ్ పాఠశాల ఆవరణలో శనివారం వివిధ పత్రికల డెస్క్ జర్నలిస్టుల సమావేశం జరిగింది. ప్రధాన పత్రికల ఎడిషన్ ఇన్‌చార్జీలతో పాటు సబ్ ఎడిటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెస్క్ జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఇళ్లస్థలాలకు సంబంధించి హౌసింగ్‌సొసైటీలో సభ్యత్వం, హెల్త్‌కార్డులు, అక్రిడేషన్ కార్డులు, ప్రెస్‌క్లబ్ సభ్యత్వం తదితర అంశాలపై కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. కొందరు యూనియన్ నాయకులు డెస్క్ జర్నలిస్టుల పట్ల చూపిస్తున్న అకారణ వివక్షను సమావేశం ఖండించింది. వర్కింగ్ జర్నలిస్టు చట్టం ప్రకారం డెస్క్ జర్నలిస్టులు అన్ని సంక్షేమ పథకాలకు అర్హులని పేర్కొంది. అక్రిడేషన్ కార్డులతో పాటు అర్హత ఉన్న డెస్క్ జర్నలిస్టులకు హౌసింగ్‌సొసైటీలో సభ్యత్వం పునరుద్ధరించడంలో జాప్యం చేస్తుండటంపై సమావేశం ఆక్షేపణను, అసంతృప్తిని వ్యక్తంచేసింది. భవిష్యత్ కార్యాచరణను ప్రకటించేందుకు త్వరలో మరోమారు సమావేశం నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో ఎడిషన్ ఇన్‌చార్జిలు శంకర్‌రావు శెంకేసి(ఆంధ్రజ్యోతి), జి.కేశవ్‌కుమార్(సాక్షి),పి.వెంకటప్పయ్య(నమస్తే తెలంగాణ), కొల్లు రాజేష్, కొమ్మినేని ప్రసాదరావు, కాంకూరి వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, పాల రమేష్, బాలకృష్ణ, బి.రాంబాబు, పి.శ్రీను పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై సర్వే

తిరుమలాయపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలువారిగూడెం గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్లపై సర్వే నిర్వహించారు. తహసీల్దార్ పీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. నిరుపేదల జాబితా తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్‌సాహెబ్, ఏవో సీతారాంరెడ్డి, ఏఈవో బాలకృష్ణ, ఎంపీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.







మంచు దుప్పటి

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి25 (ఆంధ్రజ్యోతి): శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9గంటల వరు ఖమ్మం నగరంలో పొగమంచు కమ్మేసింది. నగరంలోని ప్రధనా రహదారులతో పాటు వివిధ ప్రాంతాల రహదారులన్నీ పొగమంచుతో నిండి ఉండడంతో పాఠశాలలకు, కార్యాలయాలకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు. ఇటీవల తెల్లవారుజాము నుంచి ఉదయం 8గంటల వరకు ఈ వాతావరణం ఆవిష్కృతమవుతోంది. ఈవిభిన్న అనుభూతిని ఆస్వాదిస్తూనే ప్రజలు తమ రోజువారి కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

ఘనంగా ఆర్‌జేసీ జూనియర్ కళాశాల ఫేర్‌వెల్‌డే వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి25(ఆంధ్రజ్యోతి): చదువుకు పేదరికం అడ్డుకాదని నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగితే దేనినైనా సాధించవచ్చని ఎస్‌బీఐటీ, ఆర్‌జేసీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ అన్నారు. శనివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాలో ఆర్‌జేసీ జూనియర్ కళాశాలల ఫెయిర్‌వేల్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కృష్ణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మిపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైడ్‌డ్రెయిన్లపై నిర్మాణాల తొలగింపు

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి25(ఆంధ్రజ్యోతి):వీధుల వెంట ఉన్న డ్రెయినేజీలపై నిర్మాణాలను శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. బల్లేపల్లి, జయనగర్ కాలనీ, పాండురంగాపురంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పదులసంఖ్యలో నివాసాల ముందు ఉన్న నిర్మాణాలను తొలగించారు. వాహనాలు రవాణాకు క్లియర్ చేశారు.

బావి వివాదం: ఎండుతున్న పైరు

కామేపల్లి, జనవరి25 (ఆంధ్రజ్యోతి): సోదరుల మధ్య బావివివాదం కారణంగా పంట ఎండిపోతోంది. దీనిపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బర్లగూడెం గ్రామానికి చెందిన లూనావత్ చిన్న-భారతి దంపతులు సొంత పట్టా భూమిలో బావి నీరు పెట్టుకొని వ్యవసాయం చేస్తున్నామని తెలిపారు. ఇటీవల కుటుంబ సభ్యులు లునావత్ ప్రేమ్. అశోక్, నీలా, శ్రీధర్, దేవేందర్ కక్షగట్టి పైపులను ధ్వంసం చేశారు. పక్క రైతు వద్ద బోర్ నీరు కిరాయికి తీసుకొని పెట్టుకుంటుంటే దానికి అడుడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రెండుఎకరాలకు రూ.3లక్షల వరకు పెట్టుబడి అయిందని తోట ఎండిపోతుందని ఆవేదన వ్యకం చేస్తున్నారు. ఈవిషయంపై ఖమ్మం సీపీకి ఫిర్యాదు కూడా చేశామని, కానీ తిరిగి నాపైనే అక్రమంగా కేసు పెట్టారన్నారు.



ఎండిపోతున్న పైరును చూపుతున్న రైతు చిన్నా

అలరించిన 'ఆట కావాలా.. పాట కావాలా'

ఖమ్మంసాంస్కృతికం, జనవరి24(ఆంధ్రజ్యోతి): భక్తరామదాసు కళాక్షేత్రంలోమొగిలి ఎంటర్ టైనమెంట్స్ అధినేత ప్రముఖ కమెడియన్ మొగిలి గుణకర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఆటకావాలా, పాట కావాలా ప్రేక్షకులను ఆనందడోలికల్లో తేలియాడించింది.. మెగాస్టార్ చిరంజీవిపై అభిమానంతో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమం అలరించింది. రెండురాష్ట్రాలకు చెందిన ఎస్‌వీ రమణ, మాలతీ నాయుడు, నాగస్వర్ణశ్రీ, వరంగల్ సంధ్య, కావేలి రామారావు, తదితర పలువురు గాయకులు చిరంజీవి హిట్ చిత్రాల్లోని పాటలు పాడారు. చిరంజీవి డూప్ కార్యక్రమానికి మరో ఆకర్షణగా మారాడు. జబర్దస్త్ ఫేం కంద్రాతి చంద్రశేఖర్, సినీదర్శకుడు కొత్తపల్లి శేషు ముఖ్యఅతిథులగా పాల్గొన్నారు. నాగసాయి, నవీన్ కుమార్, జిల్లా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రమాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాల పంట

ఖమ్మంస్పోర్ట్స్‌జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల19న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించారు. పోటీలలో మొత్తం 20స్వర్ణ, 15 రజత, 3కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలోడీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మానుకొండ రాధాకిషోర్, రాయల నాగేశ్వరరావు,కమర్తపు మొరళి, మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి నున్నా రాధాక్రిష్ణ, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సిక్కిరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్,జనవరి25(ఆంధ్రజ్యోతి):క్రీడలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సిక్కిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్తా పాఠశాలలో 'ఉడాన్' క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నతనం నుంచే క్రీడలను నేర్చుకోవడం ద్వారా చదువులోనూ ముందుంటారని పేర్కొన్నారు. బ్యాడ్మింటన్ క్రీడలో తాను ఈ స్థాయికి రావడానికి ఎంత కష్టపడ్డానో క్రీడాకారులకు వివరించారు. తానుకూడా మొదట ఖమ్మంలోనే బ్యాడ్మింటన్ క్రీడను నేర్చుకున్నానని తన అనుభవాలను పంచుకున్నారు.అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కరుణాసైదుబాబు, పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, ఏజీఎం చేతన్ మాధుర్, జయప్రకాశ్, ప్రిన్సిపాల్ జయసుధ ఉన్నారు.



మాట్లాడుతున్న సిక్కిరెడ్డి

బచ్చోడును మండల కేంద్రంగా ప్రకటించాలి

తిరుమలాయపాలెం, జనవరి25(ఆంధ్రజ్యోతి): బచ్చోడును మండల కేంద్రంగా ప్రకటించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ కోరారు. శనివారం మండలంలోని బచ్చోడులో ఆపార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2003 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. మండల కేంద్రంగా ఏర్పాటు చేయడం వల్ల 25 గ్రామపంచాయతీలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షనాయకుల తిమ్మిడి హనుమంతరావు, ఎన్నబోయిన శ్రీనివాసరావు, ఎం.రాజేంద్రప్రసాద్, అంగిరేకుల నరసయ్య, మల్లిఖార్జున్, రమేష్, బింగి రమేష్, జి.వీరస్వామి, దరగయ్య తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో హార్వెస్టు విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి25(ఆంధ్రజ్యోతి): యునిఫైడ్ కౌన్సిల్ నిర్వహించే నేషనల్ సైన్సు టాలెంట్ టెస్టులో నగరంలోని హార్వెస్టు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్,ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. 2024 డిసెంబరు 4న నిర్వహించిన ఈపరీక్ష ఫలితాలు శనివారం ప్రకటించారు. పాఠశాలకు చెందిన 15 మంది ఎంపికయ్యారని తెలిపారు.

జహీర్‌పుర మాదిగ యువజన సంఘానికి 69 ఏళ్లు

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 32వ డివిజన్‌లోని జహీరపుర మాదిగ యువజన సంఘం 69 సంవత్సరాలు పూర్తి చేసుకొంది. సంఘం సభ్యులు ఒక క్రమశిక్షణతో పనిచేస్తూ సొంత భవనాన్ని సైతం నిర్మాణం చేసుకున్నారు. కాగా జహీరపురమాదిగ యువజన సంఘాన్ని శనివారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. భవనానికి సంబంధించిన పన్నును రూ.69వేలు సభ్యులు చెల్లించారు. సంఘం అధ్యక్షుడు తొళ్ల ఈశ్వర్, కమిటీ సభ్యుల వట్టెపు విజయ్, బచ్చలకూరి రాము, మెలుగూరి ధరణి, తంబర్ల వెంకటకర్ణ, ఏపూరి పూరి, తొళ్ల దినేష్ చంద్ర, గౌరవ సలహాదారు జీడీ గోపాలరావు పాల్గొన్నారు.



కార్యాలయం వద్ద జహీర్‌పుర మాదిగ యువజన సంఘం సభ్యులు

క్రీడలతో ఆనందం, ఆరోగ్యం

ఖమ్మంస్పోర్ట్స్‌జనవరి 25(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆనందంతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందని మేయర్ పునకొల్లు నీరజ పేర్కొన్నారు. శనివారం నగరంలోని హార్వెస్ట్ పాఠశాల మైదానంలో యంగ్ మెన్స్ క్రిష్టియన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని పేర్కొన్నారు. ఆటలు ఆడటం వల్ల చదువులోనూ రాణిస్తారని అన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో యంగ్ మెన్స్ క్రిష్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ బీజీ క్లెమెంట్, సెక్రెటరీ సుధాకర్, ఎస్ఆర్ఐ గేర కార్తిక్, శేఖర్‌బాబు, గౌతమిశిల్ప, జోర్దాన్, సదానందం, రాజశేఖర్, జోసఫ్‌రామారావు పాల్గొన్నారు.

'తార్నాకకు బస్ సర్వీస్ నడపాలి'

సత్తుపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విశ్రాంతి ఉద్యోగులతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌లోని తార్నాక ఆసుపత్రి వరకు రాత్రి డీలక్స్ సర్వీస్ నడపాలని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిపో అధ్యక్షుడు జీవీ.రావు కోరారు. శనివారం డిపో ఆవరణలో మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన హయత్‌నగర్ డిపో వద్ద సంఘ 11వ రాష్ట్ర మహాసభ జరుగనుందని, కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 2017 పీఆర్సీ ఏరియర్స్, డీఏ ఏరియర్స్ రాలేదని, ఫ్రీ ట్రావలింగ్ డీలక్స్ వరకే ఉండగా సూపర్ లగ్జరీలో కూడా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సాధు సుధాకర్, ఎస్‌పీ.రావు, ఆర్‌వీ.రావు, ఆర్‌వీ.కుమార్, ఎంఎస్.నారాయణ, ఏవీ.రాయుడు, డీవీకే.రెడ్డి, బాబా, భాస్కర్, ఏవీ.రావు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

కొణిజర్ల, జనవరి25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని మంచి ఫలితాలు సాధించాలని మధిర సహాయ షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కొత్తా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని తనికెళ్లలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులను సమస్యలను తెలుసుకున్నారు. రాత్రిపూట భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శరత్ పాల్గొన్నారు.

'క్రైస్తవ సమాజానికి అండగా ఉంటాం'



మాట్లాడుతున్న పీ.ఎనోష్‌కుమార్

సత్తుపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అన్నివేళలా క్రైస్తవ సమాజానికి ఏఐసీసీ అండగా ఉంటుందని ఇండిపెండెంట్ అసోసియేషన్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ పీ.ఎనోష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గంగారంలోని షాలేము గ్రేస్ ప్రార్థన మందిరంలో శనివారం ఏఐసీసీ సేవకుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏఐసీసీ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఖమ్మంపాటి రవి, ఉపాధ్యక్షుడిగా శుభాకర్ బెన్నీ, ప్రధాన కార్యదర్శిగా రాయల ప్రభాకర్, కోశాధికారిగా కొత్తపల్లి ఏసుబాబు, జాయింట్ సెక్రటరీగా విజయ్‌పాల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అజయ్, ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు.

జమలాపురంలో శ్రీవారికి సర్వాంగాభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, జనవరి25 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాలకవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ ఇరకులపాటి కృష్ణప్రసాద్, వెంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మాస్ అసెంబ్లీ

తల్లాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలభారతి విద్యాలయంలో శనివారం విద్యార్థులు మాస్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా వ్యవహరించారు. అసెంబ్లీ సమావేశాల తీరును కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఇన్‌చార్జి యాచమనేని శశాంక్ పాల్గొన్నారు.

వైరాలో చెరువులను కాపాడాలి: రైతు సంఘం

వైరా, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వైరా పరిధిలోని చెరువులు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా తరహాలో ఇక్కడ వైడ్రా ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా మునిసిపాలిటీ పరిధిలో కబ్జాలకు గురైన చెరువులు, ప్రభుత్వ భూములను శనివారం పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, వడ్లమూడి మధు, పాసంగులపాటి రవి, మోదుగు వెంకట్, ఖాసీం, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్య విషయాలపై కళాజాత

ఏన్కూర్, జనవరి25(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆరెంపుల సతీష్ కళాబృందం శనివారం గార్లొడ్డు గ్రామంలో ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగించారు. ఆరోగ్యం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను ఆటపాటల ద్వారా చైతన్యపరిచారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి రాములు, సీహెచ్‌వో డి.శివరాజు, ఎంపీహెచ్‌వో లలితకుమారి, అరుణకుమారి, ఏఎన్ఎం శారద పాల్గొన్నారు.

28 జేవీఆర్ కళాశాలలో నాలెడ్జ్ ఎక్స్‌పో

సత్తుపల్లిరూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఈనెల 28వ తేదీన నాలెడ్జ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి తెలిపారు. శనివారం కళాశాలలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండగా క్రీడలతో పాటు కొత్త జ్ఞాన సముపార్జన పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవతా మూర్తుల కల్యాణ మహోత్సవాలు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వైరా, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వైరా శాస్త్రానగర్‌లోని సత్యసాయి సేవసమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం దేవతామూర్తుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సువర్చల శ్రీ హనుమత్కా కల్యాణ ఘట్టాన్ని కన్నుల పండుగగా జరిపారు. భారీ సంఖ్యలో భక్తులు సంప్రదాయ దుస్తుల్లో ఈ కల్యాణ మహోత్సవాన్ని నైనానందకరంగా తిలకించారు. సత్యసాయి సేవసమితి నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాధితులకు ఫోన్ల అందజేత

ముదిగొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న నాలుగు సెల్ ఫోన్లను బాధితులకు సీఐ మురళీ శనివారం అందజేశారు. వివిధ ప్రదేశాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకొని ముదిగొండ పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాధితులు తమ ఫోన్లు పోగొట్టుకున్నట్లయితే సీఈఆర్ఐ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే ట్రేస్ చేసి పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి తమకు అందించిన సీఐ మురళీకి కృతజ్ఞతలు తెలిపారు.

ముందే వచ్చిన వరి కంకులు

- రైతుల కొంపముంచిన ఆర్ఎన్ఆర్15048 రకం విత్తనాలు
- 75ఎకరాలలో 30శాతంమేర వరికి ముందే వచ్చిన కంకులు
- నకిలీ విత్తనం విక్రయించినట్లుగా రైతుల ఆవేదన



ముందే వచ్చిన వరికంకులు

సత్తుపల్లిరూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పంట చేతికి అందివచ్చే సమయానికి ముందు కంకులు వచ్చిన పంట ఓ వైపు నేల రాలిపోతుందని.. మరో వైపు దిగుబడి ఆశించిన స్థాయికంటే తక్కువగా వచ్చే అవకాశాలు ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నకిలీ వరి విత్తనాలతో సాగుచేసి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని, నకిలీ విత్తనాలు అంటగట్టిన వారిపై చర్యలు తీసుకుని తమకు పరిహారం ఇప్పించాలని సత్తుపల్లి మండలం రేజర్లలోని ముగ్గురు రైతులు ఫులగం అంజిరెడ్డి, భీమిరెడ్డి నర్సారెడ్డి, గొర్ల అంజిరెడ్డిలు వేడుకుంటున్నారు. శనివారం రైతులు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ పట్టణంలోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం నుంచి (ఎం) ఆర్ఎన్ఆర్15048కు చెందిన వరి విత్తనాలను గతేడాది నవంబర్ నెలలో కొనుగోలు చేసి ముగ్గురం వేర్వేరుగా 75ఎకరాలలో సాగు చేపట్టామన్నారు. ఈ క్రమంలో 120రోజులలో రావాల్సిన కంకులు 30శాతానికి పైగా వరిపైరులో 30రోజులల్లోనే కనిపించడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం షాప్ యజమానితో పాటు వ్యవసాయాధికారులకు తెలియజేయగా పంటను పరిశీలించారని, శాస్త్రవేత్తలు వచ్చి పరిశీలిస్తారని చెప్పారన్నారు. అయితే ముందుగానే వరికంకులు వేయడంతో ఆశించినమేర కాకుండా పూర్తిగా నష్టాల్లోకి వెళ్లే అవకాశం ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టిన ఖర్చు పెరుగుతుందేగాని పరిష్కారం కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే రూ.30వేల పెట్టుబడి

ఎకరానికి సుమారు రూ.30వేల వరకు పంట పెట్టుబడి పెట్టామని, అదునుకంటే ముందే వరి ఈనడంతో పొలమంత తాలు కంకులు వచ్చాయని, విత్తనాల్లో లోపంతో అక్కడక్కడ తేడాలు వస్తున్నాయని వాపోయారు. 30రోజుల వ్యవధిలోనే ఈనడం, కంకులు రావడంతో భయాందోళన చెందిన రైతులు దుబ్బుకట్టకుండా బలహీనంగా మారి తాలు వరి కంకులు ఏర్పడ్డాయని, దీంతో దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని, పెట్టుబడి ఖర్చు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిఘా పెంచాలని నకిలీ విత్తనాలను అరికట్టాలని, వరిసాగులో వస్తున్న దుష్ఫలితాలను అరికట్టేందుకు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, తమకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



వరిపైరును పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు (ఫైల్)

పంటలను పరిశీలించిన ఏవో

రైతుల ఫిర్యాదు మేరకు మండల వ్యవసాయ అధికారి వై.శ్రీనివాసరావు వరి పంట సాగు చేసిన ప్రాంతాలను ఇటీవల పరిశీలించారు. నివేదికన జిల్లా ఉన్నతాధికారులకు అందజేసి వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా నాలుగైదు రోజులలో నిర్ధారణ చేయిస్తామని పేర్కొన్నారు. రైతులకు విత్తన నాణ్యతపై అనుమానాలు నివృత్తి చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రూ.వంద కోట్లతో మధిర మునిసిపాలిటీని అభివృద్ధి చేశాం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

మధిరటౌన్, జనవరి25(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వంద కోట్లకు పైగా నిధులు వెచ్చించిందని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. శనివారం మధిరలోని రిక్రియేషన్ క్లబ్ లో జరిగిన మధిర మునిసిపాలిటీ పాలక వర్గం వీడ్కోలు సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మధిర మునిసిపాలిటీ అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మునిసిపల్ మంత్రి కేటీఆర్, మునిసిపల్ చైర్మన్ మొండితోక లత అడగిందే తడవుగా నిధులు ఇచ్చారని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కొండబాల మాట్లాడుతూ మధిర గురించి ఎవరైనా మాట్లాడితే బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం తరువాత అని ఖచ్చితంగా చెప్పుకునేలా మార్పు స్పష్టంగా కనిపించేలా అభివృద్ధి చేశామని అన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత తనను మునిసిపల్ చైర్‌పర్సన్ గా ఎంపిక చేసిన కేసీఆర్, కేటీఆర్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావుకు, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణప్రసాద్, కౌన్సిలర్ బిక్కి అనిత దంపతుల ఇంటికి వెళ్లిన నామ, మధు, కొండబాలను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ విద్యాలత, కమిషనర్ సంపత్ కుమార్, వాసిరెడ్డి రామనాథం, కోట రాంబాబు, జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సోదరి సరోజనమ్మ మృతికి నివాళులర్పించిన తమ్మినేని

చింతకాని, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన తోటకూరి సరోజనమ్మ (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మృతురాలు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోదరి. ఆమె మృతదేహాన్ని శనివారం తమ్మినేని వీరభద్రం, నున్నా నాగేశ్వరరావు, పోతినేని సుదర్శన్, మడిపల్లి గోపాలరావు, రాచబంటి రాములు సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు.

మోడల్ గ్రామంగా రేపల్లెవాడ ఎంపిక

చింతకాని, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపల్లేవాడ గ్రామాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు పథకాలను 100 శాతం అమలు చేయుటలో భాగంగా గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తహసీల్దార్ కూరపాటి అనంతరాజు తెలిపారు.

ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

తల్లాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ సిరిపురం మేజర్ ఆయకట్టు పరిధిలో సాగర్‌జలాలు విడుదల చేసి పంటలను కాపాడాలని కోరుతూ శనివారం స్థానిక ఎన్నెస్పీ కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేశారు. వారబంధీ పేరుతో సిరిపురం మేజర్ కాల్వకు సాగర్‌జలాలను నిలిపివేయడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం, కాంగ్రెస్ నాయకులు గుంటుపల్లి వెంకటయ్య, రాయల రాము పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి రాము తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సాగర్‌జలాలు విడుదల చేయాలని ఆదేశించారు.

నీలాద్రిలో అధికారుల సమావేశం

పెనుబల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన వసతులపై నీలాద్రిలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావు, ఈవో పాకాల వెంకటరమణ అధికారుల నుంచి పలు సూచనలు స్వీకరించారు. సమావేశంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, ఎస్ఐ కె.వెంకటేష్, ట్రాన్స్‌కో ఏఈ కుమార్, సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, పంది వెంకటేశ్వరరావు, సూర్యదేవర రవికుమార్, వేముల కృష్ణయ్య, పసుమర్తి విశ్వనాథ్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

కల్లూరులో పారిశుధ్య కార్యక్రమం

కల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ఎన్‌హెచ్‌ఏఐ రహదారిపై ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండల అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో శనివారం కల్లూరు పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. మంత్రి తుమ్మల కల్లూరు వైపు నుంచి సత్తుపల్లి వైపునకు తరచుగా వెళ్తున్న సందర్భాల్లో ప్రధానంగా డివైడర్లకు ఇరువైపుల అపరిశుభ్రతతో మట్టి పేరుకోవడం గమనించారు. ఎన్ఎస్పీ క్రాస్ రోడ్డు వద్ద ప్రధాన రహదారికి ఇరు పక్కల గుంతలు పడడం, పిచ్చి మొక్కలు పెరగడం, గుంతల్లో మురికి నీరు నిల్వ ఉండటాన్ని తన కారు ప్రయాణంలో గమనించారు. దీంతో మంత్రి ఫోన్ ద్వారా అధికారులను మందలించారని తెలిసింది.. దీంతో శనివారం ఉదయం కల్లూరు పంచాయతీ ఈవో నాగేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు.

నేడు కొణిజర్లకు డిప్యూటీ సీఎం రాక

కొణిజర్ల, జనవరి25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగోపతి గ్రామంను ఆదర్శగ్రామంగా ఎంపిక చేశారు. ఈ గ్రామంలో ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ శనివారం రాత్రి గ్రామంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన నాలుగు పథకాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసాకు సంబంధించి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరై పథకాలను ప్రారంభిస్తున్నారని తెలిపారు. ప్రజలంతా అధైర్య పడొద్దని ప్రతి పథకం పేదవాడికి చేరుతుందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు, పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు ఉన్నారు.



కల్లూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



వైరాలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు

జాతీయ ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా అధికారులు విద్యార్థులతో కలిసి ఆయా మండలాల్లో, పట్టణాల్లో ర్యాలీలు నిర్వహించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటుకు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని మధిర కోర్టు ప్రధాన న్యాయమూర్తి టి. కార్తీక్‌రెడ్డి, ఆర్డీవోలు ఎల్. రాజేంద్రగౌడ్, గరిడే నర్సింహారావులతో పాటు పలువురు అధికారులు, నాయకులు అన్నారు. ఓటరు ప్రతిజ్ఞ చేశారు. మానవహారం నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధం లాంటిదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలసిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు.



ఏన్కూర్‌లో...



ముదిగొండలో...



సత్తుపల్లిరూరల్‌లో...



తల్లాడలో...



బోనకల్‌లో...

అన్నదానానికి రూ.లక్ష వితరణ

మధిరటౌన్, జనవరి25(ఆంధ్రజ్యోతి): భద్రాచలం రామాలయం నిత్య అన్నదాన ట్రస్ట్‌కు మధిరకు చెందిన ప్రముఖ వ్యాపారస్తులు, మధిర దాల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగా వెంకటేశ్వర్లు ఆయన సతీమణి సుగుణలు రూ.లక్షా నూట పదహారలను వితరణ చేశారు. శనివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవికి రంగా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు చెక్‌ను అందజేశారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగా హనుమంతరావు, రంగా మధులత పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్‌లో అవకతవకలపై ఫిర్యాదు

తల్లాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవకతవకలపై శనివారం ఎంపీడీవో చంద్రమౌళికి బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు ఆపతి వెంకటరామారావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో లబ్ధిదారుల ఎంపికలో భూములు లేని నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాదె కృష్ణారావు, చల్లా నరేష్, కొమ్మినేని రామారావు పాల్గొన్నారు.

అండర్-17 బాలుర క్రికెట్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక

పెనుబల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం జరిగిన అండర్-17 బాలుర క్రికెట్ జట్టులో ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి 80మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో ఖమ్మం జిల్లా నుంచి 16 మంది ఎంపికయ్యారు. 16మంది క్రీడాకారుల్లో షేక్.ముజాహిద్, రామచరణ్ సాయి, చందు, లక్ష్మీ వెంకటకుమార్, మౌనీష్‌లు వీరు ఈనెల 26వతేదీ ఆదివారం హైదరాబాద్‌లో జరిగే టీడీసీఏ అండర్-17ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని సీనియర్ క్రీడాకారుడు, కోచ్ ఉప్పుశెట్టి శ్రీనివాసరావు(మారుతీ షెడ్) తెలిపారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులను గ్రామస్థులు, అభినందించారు.